వైభవంగా శ్రీవారి కల్యాణం


కల్యాణశోభలో ఉత్సవమూర్తులు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో శ్రీవారి కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు రమణాచార్యులు, వేణుగోపాలాచార్యులు కల్యాణం నిర్వహించారు. ప్రతి నెలా రెండవ ఆదివారం స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామని ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లర్స్ సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

మహనీయులకు ఘన నివాళి



మల్లాపూర్: నాచారం ఎర్రకుంటలో మహనీయులు డాక్టర్ బీఆర్. అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలదండ కార్యక్రమం 196వ ఆదివారానికి చేరింది. పలువురు నేతలు హాజరై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నక్క నాగేశ్వర్‌రావు, చిలుక శంకర్, బిక్షపతి, ఐలేని మహేష్, ఆశన్న, గొల్ల మల్లేష్, హరిబాబు, జంగం అశోక్, గద్ద క్రాంతి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం


ఇందిరానగర్‌లో పనులను పరిశీలించిన కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. హెచ్‌బీకాలనీ, ఇందిరానగర్‌లో నిలిచిపోయిన డ్రైనేజీ పనులు ప్రారంభం కావడంతో ఆదివారం ఆయన వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. చాలా రోజులుగా మురుగు పొంగి పొర్లుతుండటంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఇక డ్రైనేజీ సమస్యలు ఉండవన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. వాటర్‌వర్క్స్ మేనేజర్ వేణుగోపాల్ స్థానికులు సాయి, నిస్సార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘హైడ్రాపై ఆందోళన వద్దు’


కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: హైడ్రా చర్యలపై ఆందోళన పడొద్దని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఆదివారం బలరాంనగర్ కాలనీలో పర్యటించారు. సఫిల్‌గూడ చెరువు సమీపంలో కాలనీలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. సామాన్య మధ్య తరగతి ప్రజల ఇళ్లను కూల్చివేయడం జరగదని హైడ్రా కమిషనర్ తెలియజేశారన్నారు. ఇక భవిష్యత్‌లో భారీ నిర్మాణాలు జరగకుండా, చెరువును పరిరక్షించుకోవడానికి ముందుకు రావాలని కాలనీవాసులను కోరామన్నారు. ఈ సమావేశంలో కాలనీ ప్రతినిధులు మండల రాధా కృష్ణయాదవ్, గోపాల్‌సింగ్, సూరజ్‌సింగ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నారాయణ గురుదేవ జయంతి


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: కానాజీగూడలోని శ్రీనారాయణ విద్యాభవన్‌లో శ్రీనారాయణ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నారాయణ గురుదేవ జయంతి వేడుకలు, ఓనం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జగతిరాజ్, సువర్ణకుమార్, దత్తు, సొసైటీ అధ్యక్షులు పవిత్రన్, విజయన్, మనోజ్, రమేష్, హరిదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ అల్వాల్‌లో కడిల్ కేర్ క్లినిక్ ప్రారంభం


క్లినిక్‌ని ప్రారంభిస్తున్న మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: ఓల్డ్ అల్వాల్ రెడ్డి ఎన్‌క్లేవ్ వద్ద ఏర్పాటుచేసిన కడిల్ కేర్ క్లినిక్‌ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రారంభించారు. పేషంట్లకు సరైన సదుపాయాలు కల్పించి సరైన వైద్యం అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ ఎన్.సురేష్‌కుమార్, డాక్టర్ పూజ మాలి, మనోజ్, బొబ్బిలి సురేందర్‌రెడ్డి, సర్వేష్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ, పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



గౌతంనగర్: జయగిరి లక్ష్మీనర్సింహస్వామినగర్ చౌరస్తాలోని రేణుకా ఎల్లమ్మ, నల్ల పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి రాకేష్ రూ.51,000 విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాండు రంగన్, పరమేష్, సత్యనారాయణ, యాదగిరి, శ్యామ్‌గౌడ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

జై జై గణేశా.. జయములిమ్ము గణేశ !


గౌతంనగర్ వాణినగర్‌లో ఎంపీ ఈటల రాజేందర్

చిలుకానగర్‌లో ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ గీత



మల్లాపూర్‌లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి


పీర్జాదిగూడ 1వ డివిజన్‌లో బీఆర్‌ఎస్ నేత జక్క వెంకట్‌రెడ్డి


శివసాయినగర్ కాలనీలో..

ఉప్పల్, మల్కాజిగిరి జోన్ పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయక చవితి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఆదివారం గణపతి మండపాలతో పాటు ఇళ్లలో గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదానం, విశేష కార్యక్రమాలు చేపట్టారు. పలు మండపాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం

10 వేల పేపర్ స్ట్రాలతో గణనాథుడు

మల్లాపూర్: నాచారం బాబానగర్‌కు చెందిన సూర్యప్రకాష్ గత 15 ఏళ్లుగా నాచారంలో వినూత్నంగా వినాయకుడిని తయారు చేసి ప్రతిష్టిస్తున్నాడు. ఈ ఏడాది కూడా 10 వేల పేపర్ స్ట్రాలతో గణనాథుడిని తయారు చేశాడు. మొత్తం 10 ఫీట్ల ఎత్తు, 15 కేజీల బరువుతో కూడిన వినాయకుడిని తయారు చేసేందుకు రెండ్రోజుల సమయం పట్టిందన్నారు. గతేడాది ఇస్రో చంద్రయాన్–3 గణనాథుడిని తయారు చేశాడు.


నాచారం బాబానగర్‌లోని గణనాథుడు


ఉప్పల్ సాయిబాబా కాలనీలో కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి


బాబానగర్ ప్రత్యేక పూజల్లో యువకులు


డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్


పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో మేయర్


న్యూ విద్యానగర్‌లో కార్పొరేటర్ శ్రవణ్


దయానంద్‌నగర్‌లో..


రామ్‌నగర్ కాలనీలో..


సఫిల్‌గూడ జైన్ బాలాజీ గేటెడ్ కమ్యూనిటీలో..


రామకృష్ణ రెసిడెన్సీలో ..


వేంకటేశ్వరనగర్ మంజీరా అపార్ట్‌మెంట్‌లో..


పీజీనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


ఎన్‌హెచ్‌ఆర్ కాలనీలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

కాప్రా చెరువులో నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన


నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సీపీ సుధీర్‌బాబు

కాప్రా: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కాప్రా చెరువులో నిమజ్జన ఏర్పాట్లను రాచకొండ సీపీ సుధీర్‌బాబు, జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ పరిశీలించారు. ఆదివారం సాయంత్రం కాప్రా చెరువును సందర్శించిన ఆయన నిమజ్జనాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు వివరించారు. నిమజ్జనం చేసే చెరువులు, కుంటల వద్ద క్రేన్లు, బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. గణపతి నిమజ్జనాల కోసం వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించామని తెలిపారు. గజ ఈతగాళ్లను కూడా చెరువుల వద్ద అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి ఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు పూర్తయ్యేలా తగిన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. డీసీపీ పద్మజ, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో ఏర్పాట్లు : జెడ్సీ హేమంత్

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిమజ్జన ఏర్పాట్ల కోసం అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకెళ్తున్నట్లు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ తెలిపారు. ఆదివారం ఉదయం కాప్రా చెరువును సందర్శించిన జెడ్సీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. కాప్రా డిప్యూటీ కమిషనర్ జగన్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో పిల్లలతో సహా..


పిల్లలతో వీణ (ఫైల్)


పిల్లలతో సరీన్ బేగం (ఫైల్)

ఇద్దరు మహిళల అదృశ్యం

మేడిపల్లి: ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్, సాయి ఐశ్వర్య కాలనీకి చెందిన జీవన్ ప్రభుత్వ ఉద్యోగి. కాగా భార్య మునవత్ వీణ(35) వీరికి ఇద్దరు కుమారులు సంహిత్(9), శ్రీమన్విత(7) ఈనెల 6న స్కూల్ నుంచి పిల్లలను తీసుకొస్తానని వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు మేడిపల్లి పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మల్లాపూర్: తల్లి, పిల్లలు అదృశ్యమైన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం రాఘవేంద్రనగర్‌కు చెందిన మహ్మద్ ఖాజావుద్దీన్ కుమార్తె ఎండీ సరీన్‌బేగం (25) జవహర్‌నగర్‌కు చెందిన జావీద్‌తో వివాహమైంది. కాగా వీరికి ఇద్దరు పిల్లలు రాబియా బసిరి (10) అబ్దుల్ రఫీ(06) ఉన్నారు. గత కొంతకాలంగా భర్త జావీద్ అనుమానంతో భార్యను వేధిస్తున్నాడు. దీంతో ఆమె పిల్లలతో కలిసి నాచారం తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఉంటోంది. ఆగస్టు 21న పిల్లలను ట్యూషన్‌లో దింపి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు నాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణప్రసాద్‌కు మందకృష్ణ నివాళి

కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్‌ఎఫ్‌సీ రిటైర్డ్ సైంటిఫిక్ ఆఫీసర్, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఎంప్లాయిస్ యూనియన్, ఎమ్మార్పీఎస్‌లో కీలకంగా వ్యవహరించిన కృష్ణప్రసాద్ అంత్యక్రియల్లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పాల్గొని పాడె మోశారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంజయ్య, ఎన్‌ఎఫ్‌సీ, ఉద్యోగ సంఘాలు, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు నివాళులర్పించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం నిర్మల నృత్యనికేతన్ గురువు విజయలక్ష్మి శిష్యబృందంచే నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. వినాయకస్తుతి, ముత్తుస్వామి దీక్షితార్ స్తుతి, అన్నమాచార్య కీర్తన, త్యాగరాజ కీర్తనలు సైతం ఆకట్టుకున్నాయి. కళాకారులు ప్రదర్శనతో మెప్పించారు.

గుర్తు తెలియని యువకుడి మృతి

మల్కాజిగిరి: గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..ఆదివారం ఉదయం మీర్జాలగూడలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని యువకుడు(35) కిందపడి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. 108 ద్వారా గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

వలస కార్మికుడి ఆత్మహత్య

ఉప్పల్: బతుకు దెరువు కోసం మధ్యప్రదేశ్ నుంచి నగరానికి వచ్చిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. ఉప్పల్ భగాయత్‌లో కూలీపని చేస్తున్న ఈశ్వర్దిన్ కేవట్(22) శనివారం రాత్రి తాను ఉంటున్న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదేరోజు రాత్రి 11 గంటలకు స్నేహితులు 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీపీసీసీ చీఫ్‌కు శుభాకాంక్షల వెల్లువ


పుష్పగుచ్ఛం అందజేసిన ఉప్పల్ కాంగ్రెస్ నేత పరమేశ్వర్‌రెడ్డి


శుభాకాంక్షలు తెలుపుతున్న పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్

ఉప్పల్: నూతన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను ఆదివారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నేతలతో ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజవర్గంలో పార్టీ పటిష్టతకు నిరంతరం కృషిచేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా చూడాలని మహేష్‌గౌడ్ సూచించినట్లు పేర్కొన్నారు.

మేడిపల్లి: మహేష్‌కుమార్‌గౌడ్‌ని ఆదివారం తన నివాసంలో మేడ్చల్ బీ– బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, కాంగ్రెస్ నేతలు పప్పుల అంజిరెడ్డి పీర్జాదిగూడ నాయకులు పాల్గొన్నారు.

రామంతాపూర్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం రవికుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గౌతంనగర్: టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌ను ఆదివారం గౌతంనగర్‌కి చెందిన కాంగ్రెస్ నేతలు బోనగిరి సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో కలిసి శాలువాతో సత్కరించారు. సతీష్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

కలర్ పెయింట్స్ గోదాంలో అగ్నిప్రమాదం


నాచారం గోదాంలో ఎగిసిపడుతున్న మంటలు

మల్లాపూర్: కలర్ పెయింట్స్ కెమికల్ గోదాంలో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు, అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో నాచారం పారిశ్రామికవాడలోని రోడ్డు నెంబర్ 15లో నరేందర్‌కు చెందిన కలర్ పెయింట్స్ గోదాంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపకశాఖకు చెందిన 4 ఫైర్ ఇంజిన్‌లు ఘటనా స్థలానికి చేరుకొని రాత్రి 8 గంటల వరకు మంటలను ఆర్పివేశారు. వినాయక పండగ సందర్భంగా గోదాంలో ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. కంపెనీ ఆనుకొని ఉన్నా తిరుమల ఉడ్స్ కాలనీవాసులు దట్టమైన పొగ, మంటలు రావడంతో భయభ్రాంత్రులకు గురయ్యారు. ఆస్తినష్టం అనేది ఎంతమేర జరిగిందని ఇంకా అంచనాకు రాలేదు. ఘటనా స్థలాన్ని మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతి సాయిజెన్‌శేఖర్ పరిశీలిం చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణపతి మండపం వద్ద గొడవ..

8 మందిపై కేసు నమోదు

మల్లాపూర్: వినాయక మండపం వద్ద గొడవ జరగడంతో ఇరువర్గాలపై నాచారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 9 గంటల సమయంలో మల్లాపూర్ బ్రహ్మపురికాలనీ 51 బస్టాప్ సమీపంలో సతీష్‌తో పాటు కాలనీ వాసులు వినాయకుడిని ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా లైటింగ్ ఏర్పాటు చేస్తున్న సమయంలో ద్విచక్ర వాహనంపై ఎండీ యాకుబ్ పాషా, ఖాజాబాబా అటువైపుగా వస్తుండగా రోడ్డుకు అడ్డుగా కర్రలు ఉన్నాయి. దీంతో సతీష్ పక్క రోడ్డు నుంచి వెళ్లాలని సూచించడంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి గొడవకు దారితీసింది. కాలనీవాసులు ఇరువురిని ఇంటికి పంపించారు. యాకుబ్ పాషా, ఖాజాలు కలిసి మరో ఐదుగురితో సతీష్ ఇంటిపై దాడికి పాల్పడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. రాత్రే నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్‌తో పాటు పోలీసు ఉన్నాతాధికారులు గొడవ జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనలో మొత్తం 8 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.